క్లుప్తంగా

శిష్టకరణాలకు ఓబీసీ సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న శిష్ట కరణాల ఓబీసీ సాధన కమిటీ కన్వీనర్ గజపతిరావు

అగనంపూడి: అన్ని రకాలుగా వెనుకబడి ఉన్న శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తున్నట్లు శిష్ట కరణం ఓబీసీ సాధన కమిటీ కన్వీనర్ గజపతిరావు అన్నారు. శిష్ట కరణాల అసోసియేషన్ కూర్మన్నపాలెం సారథ్యంలో శిష్ట కరణాల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఓబీసీ సాధన కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులకు సమస్యను వివరిస్తున్నామన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో పలువురు నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో కూర్మన్నపాలెం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డి.సత్యారావు, గంగవరం గోపి, ప్రతినిధులు మంత్రి శ్యామ్‌ప్రసాద్, నరసింహమూర్తి, మోహనరావు పట్నాయక్, గురునాథరావు, ఉర్ల ప్రసాద్, శేఖరమంత్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ప్రశాంతత



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్

అగనంపూడి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మానసిక ప్రశాంత ఉంటుందని వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు అన్నారు. అగనంపూడి వాకింగ్ క్లబ్ ఆవరణలో వాకర్స్ క్లబ్ సారథ్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, దాని రక్షణకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను పాడు చేయడం తగదన్నారు. ఆకయితాల ఆగడాలను అరికట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బలిరెడ్డి సత్యనారాయణ, చిన్నిపూర్ణ, చట్టి నరసింగరావు, ఆకుల కోటేశ్వరావు, కిరణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి శిక్షణ

పెదగంట్యాడ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో స్కిల్ హబ్స్ ద్వారా యువతకు కంప్యూటర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాసై, 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు వారు అర్హులన్నారు. ఒక బ్యాచ్‌కు 30 సీట్లు మాత్రమే ఉన్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు 81217 43777 నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఎస్-3 స్పోర్ట్స్ క్రీడాకారిణికి పతకాలు



బంగారు పతకాన్ని అందుకున్న మన్నా మనోజ్

ఎంవీపీ కాలనీ: స్థానిక ఎస్-3 స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారిణికి స్విమ్మింగ్‌లో 5 పతకాలు లభించాయి. ఇటీవల నరసరావుపేటలో జరిగిన 9వ సబ్ జూనియర్ అండ్ సీనియర్ వింటర్ ఆక్వాటిక్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్‌లో మన్నా మనోజ్ వివిధ కేటగిరిల్లో పోటీలో పాల్గొని సత్తాచాటారు. 1500 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బంగారు పతకం సాధించడంతో పాటు 50మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్ల బెస్ట్‌స్ట్రోక్‌లో సిల్వర్ మెడల్స్ సాధించారు. దీంతో పాటు 200 మీటర్ల ఐఎంలో సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. ఎస్3 స్పోర్ట్స్ ఎరీనా నిర్వాహకులు, కోచ్‌లు, నగర క్రీడా ప్రముఖులు.. మన్నా మనోజ్‌కు అభినందనలు తెలిపారు.

నాడు ప్రభుత్వాస్పత్రులంటే శిథిల భవనాలు. పెచ్చులూడి, వర్షం వస్తే నీరుకారే శ్లాబులు. డాక్టర్లుంటే.. మందులుండేవి కావు. మందులుంటే.. డాక్టర్లుండేవారు కారు. రోగమేదైనా పారాసిటమాల్, ఓ సిరప్ అంతే. అదృష్టముంటే బతికి బట్టకట్టేవారు. లేకుంటే.. అంతే..!

నేడు సీఎం జగన్ పాలనలో పీహెచ్‌సీలు కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో అభివృద్ధి చెందాయి. నాడు-నేడు పథకంలో రూ.కోట్లు వెచ్చించారు. పూర్తి స్థాయిలో సిబ్బంది. అందుబాటులో అన్ని రకాల మందులు, రోగనిర్ధారణ పరీక్షలు. ప్రజలందరికీ ఆరోగ్య ధీమా..!

పీహెచ్‌సీ పరిధిలో.. పెరిగిన ఆరోగ్య ధీమా



పీహెచ్‌సీలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక ఆపరేషన్ థియేటర్ గది

ఇది కదా అభివృద్ధి

- కార్పొరేట్ స్థాయిలో వడ్లపూడి కణితి పీహెచ్‌సీ
- రూ.1.75 కోట్లతో ఆస్పత్రి ఆధునికీకరణ
- ప్రజలకు చేరువగా మెరుగైన వైద్యం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



రోగుల నిరీక్షణ హాల్



వైద్యాధికారుల గదులు



కొత్తగా నిర్మించిన వడ్లపూడి కణితి పీహెచ్‌సీ భవనం

కూర్మన్నపాలెం: ప్రజలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రతిష్టాత్మకంగా వైద్య ఆరోగ్యకేంద్రాల అభివృద్ధిపై దృష్టి సారించింది. దీంతో ప్రభుత్వాస్పత్రులు అధునాతన హంగులు, ఆధునిక వైద్య పరికరాలు, సదుపాయాలతో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తయారయ్యాయి. ఇందుకు వడ్లపూడి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం(పీహెచ్‌సీ) ఓ నిదర్శనం. నాడు-నేడు పథకంలో భాగంగా రూ.1.75 కోట్లతో వైద్య సిబ్బంది గదులు, రోగులకు అదనపు వార్డులు, అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేశారు. ఇపుడు ప్రజలు వైద్యసేవలకు వేరే దగ్గరికి పరుగులు తీయాల్సిన దుస్థితి తప్పింది.

పీహెచ్‌సీకి పెరిగిన రోగులు

వడ్లపూడి కణితి .పీహెచ్‌సీ అభివృద్ధికి జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నాణ్యతలో రాజీపడకుండా అద్భుతంగా నిర్మించారు. ఒకప్పుడు ఈ పీహెచ్‌సీలో రోజుకు సుమారు 50 మంది ఔట్ పేషెంట్లు(ఓపీ) నమోదు ఉండేది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమంలో దీన్ని భారీ స్థాయిలో అభివృద్ధి చేశారు. వైద్యులకు గదులు, పేషెంట్ వార్డులు, వెయిటింగ్ హాల్, మందులిచ్చే గది, ఆపరేషన్ థియేటర్, స్టాఫ్‌రూమ్, ల్యాబ్ తదితర నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులు దగ్గరుండి చేపట్టారు. వసతులు పెరగడంతో పీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య కూడా రోజుకు 80-100 మందికి చేరింది.

మరిన్ని వసతులకు ప్రతిపాదనలు

పీహెచ్‌సీలో మరిన్ని వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనిపై గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న 6 పడకల ఆస్పత్రిని 20 పడకల స్థాయికి పెంచి, అంబులెన్స్, ప్రసూతి విభాగం, ల్యాబ్, రోగులకు ప్రత్యేక గదులతో పాటు మరిన్ని సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికీ కేజీహెచ్‌తోపాటు, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే జనాలు తగ్గారని, ఈ సౌకర్యాలన్నీ అందుబాటులోకి మరింత సంతోషమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తొలగుతాయి



గతంలో వడ్లపూడి కణితి పీహెచ్‌సీకి వెళ్లినపుడు చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఓపీ కోసం నిరీక్షించేవారికి సరైన సదుపాయాలుండేవి కావు. గంటల తరబడి ఎండలోనే ఉండాల్సి వచ్చేది. రోగులు మరింత నరకం అనుభవించేవారు. ఇపుడు కొత్తగా ఓపీ దగ్గర పేషెంట్ల కోసం వెయిటింగ్ హాల్ నిర్మించడం చాలా బాగుంది. ఓపీ రోగులకు చాలా ఉపశమనం.

– వెంకటమ్మ, వడ్లపూడి

వైద్యసేవలు బాగున్నాయి



గతంలో కంటే వైద్యసేవలు బాగున్నాయి. వైద్య సిబ్బంది రోగులతో ప్రవర్తించే తీరు చాలా బాగుంది. ఒకప్పుడు ఈ ఆస్పత్రికి డాక్టర్లు ఎప్పుడొస్తారో కూడా తెలిసేది కాదు. ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధ చాలా బాగుంది. పేదల కోసం ఇంత గొప్పగా ఆలోచించే సీఎం జగన్ ప్రభుత్వం మళ్లీ మళ్లీ రావాలని కోరుకుంటున్నాం.

– నిర్మలమ్మ, గణేష్‌నగర్

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందిస్తున్నాం. కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనంలో సకల సదు పాయాలు ఉండడంవల్ల రోగులకు సంతృప్తికరమైన వైద్యం అందుతోంది. ప్రభుత్వం సకాలంలో మందులు, వైద్య పరికరాలు సరఫరా చేస్తుండడంతో వైద్యసేవలకు అంతరాయం లేదు. దీంతో రోగులకు మెరుగైన వైద్యం అందించగలుగుతున్నాం.

– టి.శివయ్య, వైద్యాధికారి

సుదీర్ఘ పోరాటం ఘనత ఉక్కు ఉద్యమానిదే



1039వ రోజు ఉక్కు రిలే దీక్షలో ప్రసంగిస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోని ఏ పరిశ్రమలో కూడా ఇంతటి సుదీర్ఘ పోరాటం జరిగిన చరిత్ర లేదని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న విశాఖ ఉక్కు ఉద్యమానికే ఈ ఘనత దక్కుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 1039వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో ఆదివారం సంస్థలోని పలు విభాగాల కార్మికులతో పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, విశాఖ ఉక్కు దీక్షను స్ఫూర్తిగా తీసుకుని, దేశ వ్యాప్తంగా కార్మికవర్గం ఐక్యంగా ఉంటూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్లాంట్‌లో ఉన్న విభాగాలను పునఃప్రారంభించి, ఉత్పత్తిని పెంచాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మిందిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న క్రైం ఎస్‌ఐ

అక్కిరెడ్డిపాలెం: నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గాజువాక క్రైం ఎస్‌ఐ ఎ.మన్మథరావు అన్నారు. మూడు రోజుల క్రితం మింది రైల్వే ట్రాక్ పక్కనున్న శ్రీ హరిహర వల్లభరాయేశ్వర స్వామి సహిత మానసాదేవి(నాగమ్మ) ఆలయంలో దొంగతనం జరగటంతో ఆలయం వద్ద గాజువాక క్రైం పోలీసులు స్థానిక ప్రజలకు ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆలయాల్లో, నివాసాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు తోడ్పతాయన్నారు. ఊరెళ్లేవారు ఎక్కువ మొత్తంలో నగదు, బంగారాలను ఇంట్లో ఉంచరాదని, అలాంటి సమయంలో సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌కు అందించాలన్నారు. బయటకు వెళ్లేటపుడు చైన్ స్నాచర్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు గాజువాక క్రైం సీఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రైం హెచ్‌సీ వరహాలు, లక్ష్మణ్, శేఖర్, శ్రీను, సచివాలయ మహిళా పోలీసులు, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖేల్ ఉత్సవ్



ఖేల్ ఉత్సవ్‌లో క్రీడాకారులతో న్యూపోర్టు ఎస్‌ఐ శ్యామ్‌సుందర్, పోర్టు అధికారులు

పెదగంట్యాడ: క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని న్యూపోర్టు ఎస్‌ఐ శ్యామ్ సుందర్ అన్నారు. అదానీ గంగవరం పోర్టు, అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేల్ ఉత్సవ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం క్రీడాకారులతో నో ఆల్కహాల్, నో టొబాకో నినాదాలు చేయించారు. టోర్నమెంట్‌లో గంగవరం, జాలరిపల్లిపాలెం, దిబ్బపాలెం, అదానీ గంగవరం పోర్టు జట్లు పోటీ పడుతున్నాయి. పోర్టు సీఏస్సార్ మేనేజర్ రమేష్‌బాబు మాట్లాడుతూ త్వరలో వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్లను కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పోర్టు సెక్యూరిటీ హెడ్ డోర్జ్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో హాసినికి బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న హాసిని సముద్ర

గోపాలపట్నం: ఆక్వాటిక్ స్విమ్మింగ్‌లో ఆదారి హాసిని సముద్ర ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. నరసారావుపేటలో శనివారం 9వ సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ అంతర్జాతీయ చాంపియన్‌షిప్ జరిగింది. ఈ పోటీల్లో 104 ఏరియా నేవి చిల్డ్రన్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న హాసిని సముద్ర ప్రతిభ చూపి.. ఈ నెల 27 నుంచి 29 వరకు బెంగళూరులో జరగనున్న 34వ సౌత్ జోన్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. ఆమె తండ్రి గోపాలపట్నం సీఐ సంతోష్‌కుమార్. పాఠశాల ఉపాధ్యాయుడు వై.వి.కె.ప్రసాద్, వైశాఖీ స్విమ్మింగ్ పూల్ కోచ్ గిరడ రామారావు ఆమెను అభినందించారు.

యాదవులకు సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట

బీచ్ రోడ్డు: గడిచిన నాలుగున్నరేళ్లలో యాదవ సామాజిక వర్గ అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని విశాఖ జిల్లా యాదవ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి, ఏపీ ఐబీసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంజగన్ రాష్ట్ర వ్యాప్తంగా యాదవులకు తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. చంద్రబాబు తనయుడు లోకేష్ తమ పార్టీ గెలిస్తే యాదవులకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో తిరుపతిలోని మొదటి దర్శనాన్ని రద్దు చేశారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే దానిని చట్టం చేసి ఆ ప్రాంతానికి యాదవ సన్నిధిగా నామకరణం చేశారని గుర్తు చేశారు. విశాఖ నగర ప్రథమ మహిళ మేయర్ హరివెంకటకుమారితో పాటు ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్ పర్సన్, 13 కార్పొరేటర్ల పదవులను యాదవులకు కేటాయించిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. విశాఖ జిల్లా యాదవ సామాజికవర్గం అంతా వైఎస్సార్‌సీపీతోనే ఉంటామన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

స్కూళ్ల గుర్తింపు పునరుద్ధరణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరరావు

గాజువాక: ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రెన్యువల్స్ విషయంలో చోటుచేసుకున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం(జిప్సా) అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జిప్సా ప్రస్తుత కార్యవర్గ కాల పరిమితి ముగుస్తుందని, వచ్చే ఏడాది ఆగస్టులో కొత్త కార్యవర్గం ఎన్నికలను నిర్వహిస్తామని తెలిపారు. జిప్సా ఇటీవల అప్సాతో అనుసంధానమైందని, ఆ సంఘంతో కలిసి వచ్చే నెలలో విహార యాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిప్సా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్, ప్రతినిధులు డి.శ్రీనివాస్, పరశురామ్, శోభన్‌బాబు, ఎం.జగ్గారావు, మురళి, జగన్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ గౌరీ సేవాసంఘం ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికలో గౌరీ సేవా సంఘం సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ గౌరీ సేవా సంఘం నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం గౌరీ జాతీయుల ఆత్మీయ కలయిక ఆదివారం సత్తివానిపాలెంలోని సత్తెమ్మతల్లి ఆలయం వద్ద జరిగింది. సేవా సంఘం ప్రతినిధులు కుటుంబ సభ్యులతో సహా వచ్చి, సందడి చేశారు. ఇటీవల జరిగిన శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన సందర్భంగా ప్రతినిధులకు సేవా సంఘం అధ్యక్షుడు దాడి వెంకట రమేష్ ధన్యవాదాలు తెలిపారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

సింహాచలం: ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలిసి భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి పరిశీలించారు. ఆరోజు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని.. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని సూచించారు. చందనోత్సవంలో ప్రముఖులకు సరైన ఏర్పాట్లు చేయలేదన్న అపవాదు రావడంతో ఈసారి ముక్కోటి ఏకాదశికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అయ్యో.. పాపం

- వృద్ధుడిని వదిలించుకున్న కన్న పిల్లలు
- ఆదుకున్న జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బంది



వృద్ధుడిని ప్రశ్నిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

అల్లిపురం: వయసులో ఉన్నప్పుడు సంపాదించాడు. పిల్లలను పెంచి, పెద్ద చేశాడు. వారికి పెళ్లిళ్లు కూడా చేశాడు. ప్రస్తుతం ఆయన వయసు మళ్లింది. వయోభారంతో నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో పిల్లలు వదిలించుకోవాలనుకున్నారు. రెండు రోజుల కిందట రాత్రి సమయంలో ఆ వృద్ధుడిని తీసుకువచ్చి జగదాంబ జంక్షన్‌లో సీఎంఆర్ జ్యువెలరీ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయారు. రెండు రోజులుగా చలిలో కదల్లేని స్థితిలో పడి ఉన్న ఆ వృద్ధుడి విషయాన్ని తెలుసుకున్న భీమ్‌నగర్ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, తన సిబ్బందితో వెళ్లి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. అతనికి సపర్యలు చేసిన అనంతరం వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనది విజయనగరం గంట స్తంభం ప్రాంతమని ఆ వృద్ధుడు తెలియజేశారు.

సేవా కార్యక్రమాలతో సీఎం జన్మదిన వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చందు

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీసీ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో చీరలు, పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వార్డు కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు సీఎం జగన్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలని సూచించారు. పార్టీని నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయాలని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని గాజువాకలో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, రాజాన రామారావు, భూపతిరాజు సుజాత, బొడ్డు నర్సింహపాత్రుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కోమటి శ్రీనివాసరావు, రోజారాణి, నాయకులు మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, ధర్మాల శ్రీను, రెడ్డి జగన్నాథం, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

గాజువాక: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఈ నెల 21న ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు కోరారు. పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జన్మదినం రోజున నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో విస్తృత సేవా కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటడం, అన్నదాన కార్యక్రమాలు, కేక్ కటింగ్‌లను నిర్వహించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు రాజాన రామారావు, బొడ్డు నర్సింహ పాత్రుడు, నాయకులు గుడివాడ లతీష్, మహాలక్ష్మినాయుడు, రెడ్డి జగన్నాథం, ఈటీ శ్యామలరావు, చిట్టిబాబు, రంబ నారాయణమూర్తి, సాపే బ్రహ్మయ్య, షౌకత్ అలీ, అండిబోయిన అప్పారావు, మార్పు శేషు, సత్యనారాయణ, కటికల కల్పన, అమ్మాజీ, సత్యవతి పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న గోదా దేవి

మల్కాపురం: మార్గశిర, ధనుర్మాసం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని రామాలయాలు,కృష్ణాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. 61వ వార్డు నగరాలవీధి రామాలయంలో కొలువుదీరిన సీతా రామ లక్ష్మణ సమేత హనుమాన్‌కు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.అనంతరం లలిత పారాయణం పఠించారు. ఆలయ నిర్వాహకుడు భోగవల్లి నాగభూషణం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.ఈ నెల రోజులు విష్ణుమూర్తికి ప్రీతికరమైన రోజులని,నిత్యం స్వామిని స్మరిస్తే సత్ఫలితాలు లభిస్తాయని పండితులు వివరించారు.

కొత్తపాలెంలో..

గోపాలపట్నం: ధనుర్మాసం ప్రారంభం కావడంతో మొదటి రోజు వైష్ణవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఇక్కడి కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి, గోదాదేవి, శ్రీదేవిలకు అభిషేకాలు అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.